క్లుప్తంగా

సీఎంకు రాఖీ కట్టిన సునీత



జగ్గయ్యపేట అర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత సోమవారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబునాయుడును కలసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసినట్లు సునీత తెలిపారు. చంద్రబాబుకు రాఖీ కట్టినవారిలో మాజీమంత్రి పీతల సుజాత, కృష్ణాజిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఉన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు) : శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకుని ముండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పరాకుంశం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం గ్రామస్తులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్‌ఐ వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ఎస్‌ఐ-2గా బీవీ వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎ.పద్మారావు విజయవాడ టూటౌన్ స్టేషన్‌కు బదిలీకాగా, ఆయన స్థానంలో వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

23న పుష్పయాగం

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 23న పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఈవో సీతారామయ్య తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ దేశ శ్రేయస్సును కాంక్షిస్తూ అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తున్నామన్నారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారి ఆలయంలో మహాగణపతి, మహాలక్ష్మి, మహా సరస్వతి, మహాకాళి, చండీ సహిత రుద్రయాగం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాగ కార్యక్రమాలకు పుష్పాలను అందజేయాలనుకునే భక్తులు ఈనెల 23వ తేదీ ఉదయం ఎనిమిది గంటల్లోపు తమ కార్యాలయంలో అందించాలని సూచించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈవో కోరారు.

విఖనస మహర్షి జయంతి



తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విఖనస మహర్షి జయంతి వేడుకలను అర్చకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వెంకటేశ్వరస్వామి వారికి అభిషేకాలు, విశేష అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారికి నిత్య కల్యాణంలో భాగంగా పలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



కంచికచర్ల:రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన మార్త వెంకటేశ్వరరావు(53) ఈనెల 14వ తేదీన దొనబండ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా, పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలోకి రాగానే నేషనల్ హైవేపై వెనుక నుంచి వేగంగా కారు వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వెంకటేశ్వరరావు సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్ : రాఖీ పౌర్ణమి వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొని ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నివాసంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్మన్ రాఘవేంద్రకు మహిళలు రాఖీ కట్టగా, ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆడపడుచుల ఆప్యాయతకు ప్రతీక ఈ రక్షాబంధన్ నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, కౌన్సిలర్లు కాశీ అనురాధ, కాటగాని శివకుమారి, నాయకులు కాశీ కిషోర్, కాటగాని నరసింహారావు, గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు రాఖీ కడుతున్న వైస్ చైర్‌పర్సన్ హఫీజున్నీసా, పక్కన కౌన్సిలర్లు, నాయకులు

ఆయా విద్యాసంస్థల్లో...

పట్టణంలోని ఆయా విద్యాసంస్థల్లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన్ స్కూల్‌లో బాలబాలికలు రాఖీ ఆకృతిలో కూర్చుని తమ ఉత్సాహాన్ని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. శ్రీగౌతమీ హైస్కూల్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో ప్రిన్సిపాల్ బొల్లా శ్రీనివాసరావు బాలబాలికలకు రాఖీలు కట్టించి రాఖీ విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల అందమైన అనుబంధం..అంతులేని అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను నందిగామ పట్టణ, మండల ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే తలస్నానాలాచరించి ఆయా ఆలయాలలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భద్రకాలం ముగిసిన తరువాత అన్నకు చెల్లెళ్లు.. తమ్మునికి అక్కలు రాఖీ కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు, పెద్దలు, వృద్ధులు సైతం వయో భేదం లేకుండా



గండ్రాయిలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


సోదరులకు రాఖీలు కట్టి వారి అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సోదరులు వారి అక్కాచెల్లెళ్లకు బహుమతులను అందజేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

గండ్రాయి(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెలు తమ సోదరులకు రాఖీ కట్టి శుభాకంక్షలు తెలియజేశారు. గండ్రాయిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, జ్యోతికుమారి, దేవదానం, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీరూపంగా నిలిచే రాఖీపౌర్ణమిని సోమవారం వత్సవాయి మండల ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ తోడబుట్టిన వారికి రాఖీ కట్టేందుకు స్వగ్రామాలకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో రక్షాబంధన్ వేడుక జరిగింది. తోడబుట్టిన వారికి ఆడపడుచులు రాఖీ కట్టి నూరేళ్ల సంతోషంగా ఉండాలని కోరుకోగా, సోదరులు తమ సోదరికి బహుమతులు అందజేశారు.



రాఖీ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



రాఖీలను చూపుతున్న విజ్ఞాన్ విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నందిగామ టౌన్: కలకత్తాలోని ట్రైనీ వైద్యురాలిపై జరిగిన పాశావిక ఘటన అత్యంత హేయమైనదని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ పేర్కొన్నారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నందిగామలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేశంలో ప్రతి పది నిముషాలకు ఓ మహిళపై దాడి జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కలకత్తాలో దురాగతానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించటంతోపాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గోపీనాయక్, హసన్, కాజా, నరసింహ, అశోక్, వైద్యులు సత్యనారాయణ, సాయిస్వరూప్, విద్యార్థులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

చందర్లపాడు ఎస్‌ఐగా దుర్గామహేశ్వరరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు ఎస్‌ఐగా మోర్ల దుర్గామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్.ధర్మరాజు విజయవాడలోని గుణదలకు బదిలీ కాగా ఆస్థానంలో దుర్గా మహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా అక్రమ రవాణాకు పాల్పడినా మాదక ద్రవ్యాల విక్రయాల సాగించినా సహించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాలక్ష్మీదేవికి 'శ్రావణ' ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సోమవారం విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాలు, 108 కలశాల జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నుదురుమాటి కృష్ణ ప్రసాద్ శర్మ, సహాయ అర్చకులు రెంటచింతల కాశీ విశ్వనాథ శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ చేశారు.

- ఈ నెల 30న కొత్త అమ్మవారి దేవస్థానంలో సామూహిక లక్ష కుంకుమార్చన, చండీహోమం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తారని దేవస్థాన కమిటీ పేర్కొంది.

సంతోషిమాత జయంతి ఉత్సవాలు

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లంబాడీపేటలోని ముక్కా అప్పారావు వీధిలో వేం చేసిన శ్రీ సంతోషిమాత జయంతి వేడుకలు, వరసిద్ధి వినాయకస్వామి ఆలయ 15వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంతోషిమాత జయంతి నేపథ్యంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, ఉదయం 6 గంటలకు గణపతి పూజ, దీక్షాధారణ జరిగాయి. అనంతరం అమ్మవారికి ఆవు పాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకులు ముక్కా వెంకట రమణ దంపతులు అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 108 చీరలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పంచామృత అభిషేకాల అనంతరం విశేష అలంకరణ

దుర్గమ్మ సన్నిధిలో ధ్యానయజ్ఞం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ధ్యాన యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈవో కె.ఎస్.రామరావు హాజరయ్యారు. పౌర్ణమి నేపథ్యంలో ప్రతిమాసం ఆలయప్రాంగణంలో ధ్యానకార్యక్రమం జరుగుతోందని ఈవో తెలిపారు.

13 అర్జీలు అందజేత



నందిగామటౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ 13మంది అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆయా అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

జ్యూయలరీ షోరూమ్ ప్రారంభోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లోని బంగారు కొట్ల సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరాం సుబ్బారావు జ్యూవెలర్స్, వెండి బంగారం, డైమండ్ జ్యూయలరీ మెగా షోరూమ్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పారిశ్రామిక పట్టణంగా రోజురోజుకు విస్తరిస్తున్న జగ్గయ్యపేట పట్టణంలో జ్యూయలరీ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సంస్కృత భాషను కాపాడుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని శారదా జూనియర్ కళాశాలలో సోమవారం సంస్కృతభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని భాషలకు మూలం సంస్కృతమేనని, సంస్కృత భాషను కాపాడుకోవాలని శారదా కళాశాల సంస్కృత అధ్యాపకుడు రేగిళ్ల కుమారదత్త శర్మ అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మ సన్నిధిలో సోమవారం కళాకారిణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. నగరానికి చెందిన శ్రీనటరాజ సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో చెన్నంశెట్టి మోహన్విత బృందం మూషిక వాహన వినాయక స్తుతితో ప్రారంభించారు. పలు అంశాలకు కళాకారిణులు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు.



లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలి

పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫస్టియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ఫస్టియర్‌లోనే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. కళాశాలలో అధునాతన ప్రయోగశాల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. 2023-24 విద్యా సంవత్సరంలో 243మంది ఉద్యోగాలు సాధించడంతోపాటు రూ.12లక్షల అత్యధిక వార్షిక వేతనంతో సత్తా చాటారని తెలిపారు. ఈ ఏడాది నుంచి కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రోగ్రామ్స్ కూడా తమ కళాశాలలో అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకుని పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సిద్ధం కావాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా అండ్ క్రిప్టో లాబ్స్ వంటి అడ్వాన్స్ ల్యాబ్స్ ద్వారా ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచిలకు ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులకు సీఎస్‌ఈ సంబంధిత సబ్జెక్టులపై శిక్షణ ఇస్తున్నామని తద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, సైన్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగాధిపతి దొడ్డా పవన్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు. అధ్యాపకులు, ఫస్టియర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు




హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

చిత్రం చెప్పే సంగతులెన్నో....

మనిషి జీవన ప్రస్థానంలో రోజూ ఎన్నో మధుర జ్ఞాపకాలు. ప్రతి మలుపును పదిలంగా కళ్లముందుంచేది మాత్రం ఒక్క ఫొటో మాత్రమే.. ఒక్క చిత్రంలో వేల భావాలు దాగుంటాయి. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం, అనుభూతి ఉంటాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా స్థానిక ఫొటోగ్రాఫర్ తన కెమెరాతో బంధించిన కంచికచర్ల చెరువుకట్ట నుంచి ఫ్లైఓవర్‌పై జిగేల్‌మనే కాంతులతో లైట్లు, బంగారు ఛాయలో మెరుస్తున్న ఆకాశం ఫొటో చూపరులను ఆకట్టుకుంది.

– కంచికచర్ల



కంచికచర్లలోని కంచలమ్మ చెరువుకట్ట వద్ద స్థానిక ఫొటోగ్రాఫర్ తీసిన ఆహ్లాదకర దృశ్యం

లూయిస్ డాగ్యురేకి ఘన నివాళి

జగ్గయ్యపేట అర్బన్ : జగ్గయ్యపేట ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అప్సరా కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాకస్ మండే డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ డాగురే కెమెరా తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఫొటోగ్రాఫర్ల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.



లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు

చిరంజీవి యువత అధ్యక్షుడిగా గోవిందరావు



వల్లపునేని గోవిందరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడిగా వల్లపునేని గోవిందరావు నియమితులయ్యారు. ఈ మేరకు చిరంజీవి యువత అభిమాన సంఘాల గౌరవాధ్యక్షుడు నాగబాబు, అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రమణస్వామి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు గోవిందరావు సోమవారం తెలిపారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడుగా సురం సుధీర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా లింగాల అరవింద్, పట్టణ అధ్యక్షుడుగా జక్కంపూడి మల్లికార్జున్, పేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల అధ్యక్షులుగా పొట్లకాయల నాగయ్య, దారెల్లి చిరంజీవి, చంద్రకాంతి నవీన్‌కుమార్ నియమితులైనట్లు ఆయన వివరించారు. తమ నియామకానికి కృషిచేసిన అఖిలభారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు కృష్ణప్రసాద్, శ్యామ్‌ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇల్లూరి సుగుణబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్ అహ్మద్, జిల్లా అధ్యక్షుడు వర్రె హనుమప్రసాద్‌లకు గోవిందరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళా రక్షణకు కొత్త చట్టాలు రూపొందించాలి

విజయవాడస్పోర్ట్స్: మహిళలు, బాలికలపై అత్యాచార, హత్య ఘటనలు రోజురోజుకీ పెరిగిపోవడం అత్యంత బాధాకరమని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా)అన్నారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణం నుంచి అంబేద్కర్ స్మృతివనం వరకు న్యాయవాదులు సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులపై ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. మహిళలు, చిన్నారులు, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక కఠినమైన చట్టాలను రూపొందించి వాటిని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలపై అత్యాచార ఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీబీఏ ప్రతినిధులు రామప్రసాద్, అజయ్‌కుమార్, పద్మజ, రవీంద్రకుమార్, శ్రీనివాసరావు, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, చక్రవర్తి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



- **శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు**

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): చిట్టినగర్‌లో పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి సోమవారం విశేష అభిషేకాలను నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకర, అర్చన నిర్వహించారు.